## రజతోత్సవ సభకు గులాబీ దండు కదిలి రావాలి

● కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ, ఏప్రిల్ 25: వరంగల్ జిల్లాలో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు కోదాడ నియోజకవర్గం నుంచి గులాబీ దండు పెద్ద సంఖ్యలో కదిలి రావాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లం మల్లయ్యయాదవ్ పిలుపునిచ్చారు. తన నివాసంలో ముఖ్య నాయకులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామానికి బస్సులు, ఇతర వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని, బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ప్రజలు కూడా సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని, ఇదే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకతకు నిదర్శనమని స్పష్టం చేశారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని, రజతోత్సవ సభతో ఇది స్పష్టం కానుందని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రసంగం కోసం రాష్ట్ర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని వివరించారు. అమలు సాధ్యం కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు చేతకాక చేతులెత్తేసిందని విమర్శించారు. కోదాడలో గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధే కనిపిస్తుంది తప్ప కాంగ్రెస్ చేసింది ఏమీ లేదని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏం జరుగుతుందో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు సుంకర అజయ్‌కుమార్, జానకి రామాచారి, శీలం సైదులు, భూపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, ఎస్‌కే.నయీమ్, పొట్ట కిరణ్‌కుమార్, ఇమ్రాన్‌ఖాన్, షర్ఫు సురేశ్, ఉపేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 25: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ బి.శ్రీకాంత్‌గౌడ్ హెచ్చరించారు. ఇటీవల మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 13 మందిని శుక్రవారం కోర్టులో హాజరు పర్చగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి.వి.రమణ ఒకరికి ఒకరోజు జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించినట్లు చెప్పారు. మిగతా 12 మందికి మొత్తం రూ.9,500 జరిమాన విధించారని వెల్లడించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడే వారికి చలానాలు విధించడంతో పాటు కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

## 27న ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగం పోటీలు

కోదాడ రూరల్, ఏప్రిల్ 25: సూర్యాపేట జిల్లా చదరంగం అసోసియేషన్, కోదాడ మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన కోదాడ పట్టణంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్-15 బాలబాలికల చదరంగం పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దిరెడ్డి గణేశ్, పారుపల్లి చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ చెస్ బోర్డులను వెంట తెచ్చుకోవాలని సూచించారు. పోటీలను కోదాడ పట్టణంలోని ఎల్ఐసీ బజార్, కట్టకొమ్ముగూడెం రోడ్డులోని మాస్టర్ చెస్ అకాడమీలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## గడ్డివాములు దగ్ధం

కోదాడ రూరల్, ఏప్రిల్ 25: ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమైన ఘటన కోదాడ పట్టణ పరిధిలోని కోమరబండలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సట్టు శ్రీను, కేశవులు, సట్టు సుధాకర్‌కు చెందిన గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో సుమారు 600 మోపుల గడ్డి దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

## హోటళ్లలో పరిశుభ్రత పాటించకపోతే చర్యలు

● మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి



పరిశుభ్రత పాటించని పంజాబీ దాబాకు జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 25: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్లలో పరిశుభ్రత పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎడవల్లి అశోక్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలను మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిశుభ్రత పాటించకపోవడం వల్ల వినియోగదారులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. నిబంధనల మేరకు హోటళ్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్లు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పరిశుభ్రత పాటించని రెడ్ బకెట్, పంజాబీ దాబాకు రూ.500 చొప్పున జరిమానా విధించారు. తనిఖీల్లో మేనేజర్ యాకూబ్ పాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షరీఫ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ప్రవీణ్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'దోమల నివారణకు డ్రైడే పాటించాలి'



హుజూర్‌నగర్ రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 25: దోమల నివారణకు ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించాలని మండల వైద్యాధికారి వేణుగోపాల్‌నాయక్ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని లింగగిరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల కారణంగా టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ప్రజలు ఇండ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పద్మ, నూర్జహాన్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: గరిడేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి వి.నరేశ్, డాక్టర్ అనిత, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, పీహెచ్ఎన్ శారద తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్: మండల కేంద్రం నూతనకల్‌లో నిర్వహించిన ర్యాలీలో డాక్టర్ లిఖిత తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి: మలేరియా డే సందర్భంగా అర్వపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ భూక్య నగేశ్‌నాయక్, సీహెచ్ఓ మాలోతు బిచ్చునాయక్ పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ చామంతి

తిరుమలగిరి, ఏప్రిల్ 25: తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో చైర్‌పర్సన్ చామంతి శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలు పోరాడాలి'

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 25: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి హేయమైన చర్య అని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ అన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీ మార్ట్ సెంటర్‌లో శుక్రవారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ప్రపంచ దేశాలన్నీ కలిసి ఉగ్రవాదంపై పోరాడి శాంతి స్థాపనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తొగటి మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రాము, నాయకులు దేవర మల్లేశ్వరి, దేశగాని హేమలత, పెంద్ర కృష్ణ, తాళ్ల సైదులు, నాగరాజు, పెంద్ర నవీన్ పాల్గొన్నారు.

# చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● సభకు ప్రతి ఊరు నుంచి కదిలి రావాలి

● బీఆర్ఎస్ నాయకుల ముమ్మర ప్రచారం



గరిడేపల్లి: మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్



అర్వపల్లి: సూర్యనాయక్ తండాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్

గరిడేపల్లి, ఏప్రిల్ 25: దేశ చరిత్రలో నిలిచిపోయేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి అన్నారు. గరిడేపల్లిలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 27న మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలను ఎగురవేయాలని, అనంతరం సభకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీలవెంకటరమణారెడ్డి, నాయకులు మాశెట్టి శ్రీహరి, కీత రామారావు, రాం సైదులు, బొలిశెట్టి సుధీర్, కర్నాటి నాగిరెడ్డి, వెంకటమ్మ శ్రీనివాస్‌రెడ్డి, పిడమర్తి అంజి, పిల్లి అంజయ్య, మామిడి వెంకటేశ్వర్లు, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

### మఠంపల్లిలో వాల్ పోస్టర్లు అంటించి ప్రచారం

మఠంపల్లి: ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ మఠంపల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు వాల్ పోస్టర్లు అంటించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, నాయకులు పిండిప్రోలు రామచంద్రయ్య, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రానికి కేసీఆరే శ్రీరామ రక్ష

కోదాడ రూరల్: తెలంగాణ రాష్ట్రానికి కేసీఆరే శ్రీరామ రక్ష అని కోదాడ పట్టణ 10వ వార్డు మాజీ కౌన్సిలర్ మామిడి పద్మావతి అన్నారు. రజతోత్సవ సభను సక్సెస్ చేయాలని కోరుతూ శుక్రవారం కోమరబండలో వాల్ రైటింగ్ ద్వారా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో మామిడి రామారావు, వేముల వీరబాబు, సట్టు మురళి, కొర్రపిడతల వీరబాబు, ఎస్‌కే.నాగులు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో సన్నాహక సమావేశాలు

ఆత్మకూర్.ఎస్: మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి, గట్టికల్, పీపానాయక్ తండా, బాబోజీతండా, రామన్నగూడెం, ఏపూరు, కాశిగూడెం, రామోజీతండా, కందగట్ల, పాత సూర్యాపేట, కోటినాయక్ తండా, దుబ్బతండా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తూడి నర్సింహారావు, వీరబోయిన కొమరమల్లు, మడ్డి శ్రీను, వీరన్న, మడ్డి వెంకన్న, యాదగిరి, వెంకన్ననాయక్, శ్రీనునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, జగపతినాయక్, బత్తుల ప్రసాద్, ముద్దం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

కోదాడ: ఈ నెల 27న బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ నేతృత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మందిని సభకు తరలించనున్నట్లు చెప్పారు.

### సభను సక్సెస్ చేయాలి

అర్వపల్లి: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊరూరా కదిలి రావాలని మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్ కోరారు. మండల పరిధిలోని బొల్లంపల్లి, కొత్తగూడెం, ఉయ్యాలవాడ, సూర్యనాయక్ తండా గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మన్నె లక్ష్మీనర్సయ్యయాదవ్, బిక్కు వీరన్న, సంజీవ, గోసుల విజయ్‌కుమార్, కాటబత్తిని లక్ష్మీనర్సు, రవీందర్, ఈశ్వర్, నర్సయ్య పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బోగాల బాలవెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మాజీ సర్పంచ్ పందిళ్లపల్లి శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శంభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

నాగారం: మండల కేంద్రం నాగారంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య ఆధ్వర్యంలో చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుండగాని అంబయ్య, రైతుబంధు సమితి జిల్లా మాజీ సభ్యుడు పొదిల రమేశ్, మండల నాయకులు కూరం వెంకన్న, చిల్లర చంద్రమౌళి, దోమల బాలమల్లు, ఈరేటి అంజి, మండల యూత్ అధ్యక్షుడు ఈదుల కిరణ్, మాజీ సర్పంచులు యారాల నర్సింహారెడ్డి, చిప్పలపల్లి సోమయ్య, తీగుళ్ల ప్రశాంత్, షేక్ నాగుల్ మీరా, గ్రామశాఖ అధ్యక్షులు కన్నెబోయిన మల్లేశ్, బండగోర్ల యల్లయ్య, ఎలుక సైదులు, తరాల ఆంజనేయులు, మట్టగజం వీరన్న, తీగుళ్ల యాదగిరి, అరుణ్, కన్నెబోయిన మణి, దేవరకొండ మురళి, నాగయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



నాగారం : పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు




కోదాడ రూరల్: కోమరబండలో వాల్ రైటింగ్ ద్వారా ప్రచారం చేస్తున్న మాజీ కౌన్సిలర్ పద్మావతి



మఠంపల్లిలో వాల్ పోస్టర్లు అంటిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సూర్యాపేట : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్

సూర్యాపేట, ఏప్రిల్ 25: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కోదాడ నియోజకవర్గ పరిధిలోని కోదాడ, మునగాల, నడిగూడెం, చిలుకూరు, అనంతగిరి మండలాలకు చెందిన ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) పై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు నమోదయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రతిరోజు విద్యార్థులకు తెలుగు రాయడం, చదవడం నేర్పించేందుకు ఉపాధ్యాయులు సమయం కేటాయించాలన్నారు. ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్‌లలో విద్యార్థుల కనీస సామర్థ్యాలు పెంచాలన్నారు. సమావేశంలో డీఈఓ అశోక్, క్వాలిటీ కో ఆర్డినేటర్ జనార్ధన్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### భూ భారతి చట్టంతో రైతుల సమస్యల పరిష్కారం

మునగాల: భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. మునగాలలోని హైస్కూల్‌లో భూ భారతి చట్టంపై శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, తాడువాయి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్డీఓ సూర్యనారాయణ, ప్రత్యేకాధికారి శిరీష, తాసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాల్, ఏడీఏ యల్లయ్య పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలి : ఏపీఓ



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ శ్రీనివాస్

అనంతగిరి, ఏప్రిల్ 25: మండల పరిధిలోని ఖానాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు ఉపాధి హామీ పథకంలో భాగంగా దారులు, ఇతరత్రా పనులు కావాలని కోరితే మంజూరు చేస్తామని చెప్పారు. ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

## గ్రామానికి వాటర్ ట్యాంకర్ బహూకరణ

మేళ్లచెర్వు, ఏప్రిల్ 25: మండల పరిధిలోని రామాపురం గ్రామానికి మాజీ ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు తన సొంత ఖర్చులతో శుక్రవారం వాటర్ ట్యాంకర్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ట్యాంకర్‌ను బహూకరించినట్లు చెప్పారు. ప్రజలు ట్యాంకర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొట్టె మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ బాధితులకు పోషకాహార కిట్లు పంపిణీ



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ స్రవంతి

పెన్‌పహాడ్, ఏప్రిల్ 25: క్షయ బాధితులు పౌష్టికాహారం తీసుకుంటే త్వరగా కోలుకుంటారని డాక్టర్ స్రవంతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం 22 మంది క్షయ బాధితులకు ప్రభుత్వం సరఫరా చేసిన పోషకాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ బాధితులు ప్రతిరోజు చికిత్స తీసుకోవడంతో పాటు పోషకాహార కిట్లను వినియోగించుకొని వ్యాధి నుంచి తొందరగా కోలుకోవాలన్నారు. ప్రతి పోషకాహార కిట్‌లో మూడు కిలోల గోధుమపిండి, 1.5 కిలోల కందిపప్పు, 250 మిల్లీ లీటర్ల నూనె, ఒక కిలో పల్లీలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా బాధితులకు బ్యాంక్ ఖాతాలో ప్రతి నెల రూ.1,000 జమ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ భూతరాజు, సైదులు, అనిల్, లింగాల రాజు సిబ్బంది పాల్గొన్నారు.

## అదనపు జూనియర్ సివిల్ జడ్జి నియామకం

హుజూర్‌నగర్, ఏప్రిల్ 25: ఇటీవల హుజూర్‌నగర్‌లో ప్రారంభించబడిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు న్యాయమూర్తిని నియమిస్తూ హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న షేక్ అయేషా పర్వీన్‌ను హుజూర్‌నగర్ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73 మంది న్యాయమూర్తులు బదిలీ కాగా వారిలో షేక్ అయేషా పర్వీన్ ఉన్నారు. బదిలీ కాబడిన న్యాయమూర్తులు మే 1వ తేదీ లోపు బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు సీజ్

కోదాడ రూరల్, ఏప్రిల్ 25: మండల పరిధిలోని కూచిపూడి శివారులో గల సర్వే నంబర్ 615లోని భూమి నుంచి మట్టిని తరలించేందుకు సీహెచ్.వెంకయ్య కంపెనీ పేరుతో కొందరు వ్యాపారులు జిల్లా మైనింగ్ అధికారుల దగ్గర ఈ ఏడాది జనవరి 16 నుంచి ఫిబ్రవరి 4 వరకు అనుమతి తీసుకున్నారు. కాగా, వారు జూన్ 4 వరకు అనుమతి ఉన్నట్లు నకిలీ పత్రాలను సృష్టించి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న జిల్లా మైనింగ్ ఇన్‌చార్జి ఏడీ విజయరామరాజు శుక్రవారం అక్కడకు చేరుకొని తప్పుడు పత్రాలను సృష్టించినట్లు తేలడంతో ఒక పొక్లెయిన్, ఐదు టిప్పర్లను సీజ్ చేశారు. మట్టి అక్రమ తరలింపునకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అసిస్టెంట్ డైరెక్టర్ వెంకన్న, ఆర్ఐ, పోలీసులు పాల్గొన్నారు.

## 'పర్యాటకులపై ఉగ్రదాడి అమానుషం'



ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులకు నివాళులర్పిస్తున్న ముస్లింలు

మఠంపల్లి, ఏప్రిల్ 25: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి అమానుషమని మండల ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ వాహబ్ అన్నారు. ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని మర్కస్ జామియా మసీదులో మౌనం పాటించారు. అనంతరం ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమాయక ప్రజల ప్రాణాలను బలితీసుకున్న ముష్కరులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు షేక్ జానీబాషా, షేక్ కుదాన్, ఇమాం సాహెబ్, షేక్ మౌలానా, జలీల్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం'



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి

నేరేడుచర్ల, ఏప్రిల్ 25: నేరేడుచర్ల లయన్స్ క్లబ్, మిర్యాలగూడ జ్యోతి ఆసుపత్రి సౌజన్యంతో పట్టణంలోని స్టార్ ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ ఎడవల్లి అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా క్యాంపులను ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు ఉచితంగా చేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం జ్యోతి ఆసుపత్రి వైద్యాధికారి ముప్వ రామారావు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే గుండెపోటు వల్ల మరణాలు పెరిగిపోతున్నాయని, ముందుగానే గుర్తించి సరైన సమయంలో వైద్యం అందిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా గుండె, గ్యాస్ట్రో, కిడ్నీ, మోకాళ్ల నొప్పులు వంటి సమస్యలపై వచ్చిన వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, కోశాధికారి యూసుఫ్, జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, చార్టర్ ప్రెసిడెంట్ కొణతం సీతారాంరెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్మన్ బట్టు మధు, పూర్ణచంద్రారెడ్డి, మాశెట్టి సైదయ్య, బసవ కోటేశ్వరరావు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం అమ్మకానికి అష్టకష్టాలు

● మిల్లుల్లో దిగుమతి చేసుకోకపోవడంతో సూర్యాపేట మార్కెట్‌కు తరలించిన ఖమ్మం జిల్లా రైతులు

● తక్కువ ధర రావడంతో ఆవేదన



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు ఖమ్మం జిల్లా రైతులు తీసుకొచ్చిన ధాన్యం

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 25: ఆ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో పోసి 20 రోజులకు పైగా నిరీక్షించారు. తర్వాత కేంద్రంలో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి కావడంతో ట్రాక్టర్ల ద్వారా మిల్లుకు తరలించారు. అక్కడా మరో రెండు రోజులు పడిగాపులు కాశారు. అయినా ధాన్యం దిగుమతి కాకపోవడంతో విసుగుపుట్టి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేలు కిరాయి చెల్లించి సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు తరలించి అమ్ముకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన కనకం ఉపేందర్, శీలం రామ్మూర్తి, తోట రవి గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో 20 రోజుల కిందట ధాన్యం పోశారు. ఈ నెల 23న కాంటాలు పూర్తి కాగా క్వింటాకు రూ.2,300 ధర పలికింది. కాంటా అయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సి ఉండగా మిల్లు యజమాని లారీలు పంపించకపోవడంతో కొనుగోలు కేంద్రంలోనే బస్తాలు నిలిచిపోయాయి. దీంతో రైతులే సొంత ఖర్చులతో ట్రాక్టర్లలో ధాన్యం బస్తాలను నేలకొండపల్లిలోని పద్మావతి మిల్లుకు తీసుకెళ్లారు. అక్కడ మిల్లు యజమాని లారీల్లో వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసిన తర్వాతనే ట్రాక్టర్లలోని ధాన్యాన్ని దిగుమతి చేస్తామనడంతో రెండు రోజుల పాటు మిల్లు వద్దే నిరీక్షించారు. రెండు రోజులైనా దిగుమతి చేసుకోకపోవడంతో ట్రాక్టర్ కిరాయి పెరిగిపోతుందని భావించి చేసేదేమీ లేక శుక్రవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యాన్ని తీసుకొచ్చారు. ఆ ధాన్యానికి సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాకు రూ.1,980 ధర పలికింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకున్నామని, కనీసం పెట్టుబడులు, కిరాయిలకు సరిపోను అయినా డబ్బులు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### పెట్టుబడి ఖర్చు కూడా రాలే

నేను 6 ఎకరాలు కౌలుకు తీసుకొని నాలుగెకరాల్లో వరి పండించాను. 160 బస్తాల దిగుబడి రాగా మా గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో పోశాను. 20 రోజుల క్రితం పోయగా ఈ నెల 23న కాంటాలు పూర్తయ్యాయి. ధాన్యానికి అలాట్ చేసిన నేలకొండపల్లిలోని పద్మావతి మిల్లు నుంచి లారీలు రాక పోవడంతో మేమే ట్రాక్టర్‌లో మిల్లుకు తరలించాం. అక్కడ దిగుమతికి ఆలస్యం చేస్తుండడంతో చేసేదేమీ లేక సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చాం. ఇక్కడ క్వింటా ధర రూ.1,980 పడడంతో పెట్టుబడి ఖర్చులకు కూడా రాలేదు

**- శీలం రామ్మూర్తి, కిష్టాపురం గ్రామం, ఖమ్మం జిల్లా**

### 50 క్వింటాలు అమ్మేందుకు తిప్పలు

నాకున్న రెండెకరాల పొలంలో వరి సాగు చేశాను. దిగుబడిగా వచ్చిన 50 క్వింటాళ్ల ధాన్యాన్ని గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో పోశాను. సుమారు 20 రోజుల తర్వాత కాంటాలు అయినప్పటికీ మిల్లులో ధాన్యం దిగుమతి చేసుకోలేదు. దీంతో చేసేదేమీ చివరికి ఖమ్మం మార్కెట్ కంటే పెద్దదైన సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం తీసుకొచ్చాను. ఇక్కడ క్వింటాకు రూ.1,980 ధర పడింది. ఈ ధర పెట్టిన పెట్టుబడులు, ట్రాక్టర్ కిరాయిలకు కూడా సరిపోదు.

**- తోట రవి, కిష్టాపురం గ్రామం, ఖమ్మం జిల్లా**